నేటి కందం- నేటికి అందం

ప్రవిమల సంక్షేమమ్మున
కవిరళమగు కృషి సలిపెడి యాలోచనతో
వ్యవసాయ కళాశాలల
నవసరముగ-నేడు-ప్రభుత యందించె మొగిన్ !!

(వ్యవసాయ రంగంలో విశేష కృషి చేయడానికి వీలుగా కొడంగల్,హుజూర్ నగర్,నిజామాబాద్ లలో 3 వ్యవసాయ కళాశాలలను ప్రారంభించ దానికి తెలంగాణా ప్రభుత్వం నిర్ణయించింది)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

చురక

ఎమ్మెల్యేల గెలుపు తీర్పు
ఎవరికో జూబ్లీ హిల్సు
ఏ పార్టీ చెప్పగలదు
ఎన్నికల్లో ప్రజల పల్సు
సానుభూతో అధికారమో
అందరికీ పెద్ద చిక్కు
తారుమారు చేయలేదా
తలరాతను డబ్బు కిక్కు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 18-10-2025   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:54   పేజీలు:6   వెల: రూ.1/-


## బీసీ బంద్‌కి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

హైదరాబాద్, అక్టోబర్ 17: బంద్ ఫర్ జస్టిస్ పేరుతో రేపు (అక్టోబర్ 18)వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్ళు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు.

తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి.

కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి.

బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## బంద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి: డీజీపీ శివధర్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రేపటి బంద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. బంద్ పేరుతో అవాంఛనీయ ఘటనలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని పేర్కొన్నారు. బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. సాధారణ ప్రజలకు సమస్యలు ఎదురవకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర బీసీ జేఏసీ సంఘం ఈ నెల 18న బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. శనివారం చేపట్టబోయే బంద్ ఫర్ జస్టిస్‌కు ఆయా రాజకీయ పార్టీలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ ప్రజలను కోరింది.

## పార్లమెంటులో బిల్లు పెట్టకుండా అడ్డుపడుతున్నదెవరో తేలాలి

### -డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ఖమ్మం అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తొలిసారిగా సైంటిఫిక్ గా కులగణన నిర్వహించామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న పనులన్నీ బిసిలు చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూశామని, అఖిల పక్షాలను తీసుకెళ్లాలని బిజెపిని కోరుతున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కూడా ముందుకు రావాలని కోరారు. రేపటి బంద్ లో కాంగ్రెస్ శ్రేణులంతా పాల్గొనాలని, బిల్లు పెడితే మద్దతిస్తామని తమ అగ్రనేతలంతా ఇప్పటికే స్పష్టం చేశారని తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల బిల్లుకు అడ్డుపడుతున్న బిజెపికి వ్యతిరేకంగా అందరూ పాల్గొనాలని సూచించారు. పార్లమెంటులో బిల్లు పెట్టకుండా అడ్డుపడుతున్నదెవరో తేలాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సహా అందరం వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తామని అన్నారు. అఖిలపక్షంతో ప్రధాని నరేంద్ర మోడీని కలవాలనుకున్నామని, మోడీ అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్




హైదరాబాద్, అక్టోబర్ 17: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. నవీన్ యాదవ్ యూసుఫ్ గూడ నుంచి నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు.

ఇక జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. అలానే బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతబరిలో నిలిచారు. ఈ ముగ్గురు జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థానికులు కావడంతో ఉపఎన్నిక ఆసక్తికరంగా మారింది. మాగంటి సునీత మినహా మిగిలిన ఇద్దరు అభ్యర్థులు గత కొన్ని ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. అయితే స్థానికంగా ఈ ముగ్గురికి గట్టి పట్టుంది.

నవీన్ యాదవ్ రాజకీయ ప్రస్థానం:

హైదరాబాద్ లోని యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తి నవీన్ యాదవ్. ఈయన బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో డిగ్రీ పొందారు. ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సిటీలో పేరున్న సోషల్ వర్కర్. నవీన్ యాదవ్ తొలిసారి 2014లో మజ్లిస్ పారీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేవలం 9 వేల పైచిలుకు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు. 2018లో ఇక్కడి నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి..భారీగానే ఓట్లు సంపాదించారు.

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరిన నవీన్? యాదవ్.. నియోజకవర్గ ఇన్‌చార్జ్?గా ఉన్నారు. అప్పటి నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ముచ్చటగా మూడోసారి జూబ్లీహిల్స్ బై పోల్ లో పోటీ చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలనే దృఢ నిశ్చయంతో నవీన్ యాదవ్ ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ త్రోబాల్ అసోషియేషన్ కు రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్ యాదవ్ కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. నువ్వు గెలవాలి.. అభివృద్ధి చేయాలంటూ నవీన్‌కు ఎంఐఎం సూచించింది.

## తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

### -రంగంలోకి దిగాయి బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం

తిరుపతి అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. కలెక్టరేట్ భవనాన్ని బంబులతో లో పేల్చేస్తామండటూ గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం రంగంలోకి దిగాయి. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ ఛాంబర్‌తో పాటు కార్యాలయంలోని వివిధ శాఖలకు చెందిన గదులను పరిశఈ?లించిన తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధరించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయ అధికారిక మెయిల్‌కు తమిళనాడు నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చింది. గడిచిన 15 రోజుల్లో బాంబు బెదిపింపు మొయిల్స్ రావడం ఆందోళన కలిగిస్తోంది.

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆఫీసులు, సంస్థలకు సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 17:జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్, ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఈ నెల 10, 11, 14వ తేదీల్లో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలున్న కార్యాలయాలు, సంస్థలకు పెయిడ్ హాలిడే ప్రకటించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21వ తేదీని తుది గడువుగా విధించారు. ఈ నెల 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 24వ తేదీ వరకు అవకాశం కల్పించారు. నవంబర్ 11న పోలింగ్, నవంబర్ 14న యూసుఫ్‌గూడలోని కేవీఆర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోపీనాథ్ మృతిచెందిన నేపథ్యంలో ఈ ఉపఎన్నిక జరుగుతుంది.

## మార్షల్ ఆర్ట్స్ లో బి.కళ్యాణ్ గౌడ్‌కు డాక్టరేట్



హైద్రాబాద్ అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వివిధ రంగాలలో సేవలందించిన నిస్నాతులైన వారికి వెల్ ఎడ్యుకేషన్ ఆండ్ పీస్ కౌన్సిల్ అవార్డుల ప్రధానం చేసింది.

సోమవారం న్యూడిల్లిలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ లో నూతన మెలుకువలతో అందించిన సేవలకు గాను తెలంగాణకు చెందిన బి.కళ్యాణ్ గౌడ్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ గౌడ్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో డాక్టరేట్ అందుకోవడం గర్వంగా ఉందని అన్నారు.దీనితో నాపై మరింత భాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లో సోషల్ వర్కర్ కాశమొల్ల క్రిష్ణ, డా:జి.సాయి యాదవ్ ఉన్నారు.

## తెలంగాణలో నాలుగురోజులు వర్షాలు.. హెచ్చరించిన వాతావరణశాఖ

హైదరాబాద్, అక్టోబర్ 17: తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా గ్రామాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఉందని చెప్పింది.

ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. సోమవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

## పేదరిక నిర్మూలనకు చదివే సరైన మార్గం : జడ్జి కీర్తి చంద్రిక రెడ్డి




ఖమ్మం, అక్టోబర్ 17: పేదరిక నిర్మూలనకు చదివే సరైన మార్గమని ఇల్లెందు కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. అలాగే బాలికలు సొంతంగా వారి కాళ్ల మీద వాళ్ల నిలబడేలా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వర రావు, న్యాయవాది పిరమిడ వెంకటేశ్వర్లు, వార్డెన్ సునీత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరల పెంపుదల.. క్లారిటీ ఇచ్చిన టీటీడీ

తిరుపతి, అక్టోబర్ 17: శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలను పెంచుతున్నట్లు కొందరు అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని టీటీడీ చైర్మన బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రతిష్టను, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి చౌకబారు వార్తలను ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. ఇలాంటి వార్తలు పూర్తి అవాస్తమని, ఆధారాలు లేని వార్తలని ఖండించారు. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ లడ్డూ ప్రసాదాల ధరలను పెంచే ఆలోచనేలేదని స్పష్టం చేశారు.

## కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్‌ల ప్రదానం




ఆదిలాబాద్, అక్టోబర్ 17: జిల్లా కేంద్రంలోని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో కరాటే ట్రైనింగ్ , బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని చాణక్య పాఠశాల విద్యార్థులతో పాటు వివిధ జిల్లాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అసోసియేషన్ ఇండియా చీఫ్ సెన్సాయి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కరాటే పరీక్షకులు సెన్సాయి తేజసింగ్ భాటియా ఆధ్వర్యంలో జపాన్ కరాటే, షోటోకన్ బెల్ట్స్ గ్రేడింగ్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో చాణక్య సంస్కృతి పాఠశాల నుంచి 11 మంది క్రీడాకారులు పి.ఆధ్య , టి.శ్రీనిధి , డి. రాణవిత, జె.ఆరుష్, టి.మధుప్రియ, పి.ఆకర్ష్ , టి.హరీష్ సింగ్,యస్. సవిధన్ , పి. మనిదీప్ , జి. నీక్షిత్, పి. సహస్ర జూనియర్ రెడ్ అండ్ ఎల్లో బెల్ట్ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ పి.సతీష్, జె. శ్రావణ్, ప్రిన్సిపల్ పి.నరేష్, కరాటే కోచ్ ప్రతీక్ష తెలిపారు.

## డిజిటల్ అరెస్టుల పేరుతో మోసాలు.. కేంద్రం, సీబీఐలకు 'సుప్రీం' నోటీసులు..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు వేగంగా పెరుగుతున్నాయి. రోజురోజుకు కేటుగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు.

ఈ క్రమంలో సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం (హోంమంత్రిత్వశాఖ కార్యదర్శి), హర్యానా ప్రభుత్వం, అంబాలా సైబర్ క్రైమ్ విభాగానికి నోటీసులు జారీ చేసింది. హర్యానా అంబాలాకు చెందిన ఒక కేసును సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుంది. సీనియర్ దంపతులను కోర్టు పత్రాలని చెప్పి రూ.1.05కోట్ల మోసానికి పాల్పడ్డారు. డిజిటల్ అరెస్ట మోసాలపై అభిప్రాయం చెప్పాలనింటూ కేంద్రం, సీబీఐకి నోటీసులు ఇచ్చింది.

జస్టిస్ సూర్యకాంత్, జాయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులు, సంతకాల ఫోర్జరీలతో వ్యక్తులను మోసం చేయడమే కాకుండా న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని డిజిటల్ అరెస్టులు దెబ్బతీస్తాయని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసు ఒక్కటే కాదని.. న్యాయపరంగా డిజిటల్ అరెస్టులను పరిశీలించాలనుకుంటున్నట్లు తెలిపింది.

దేశంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి నేరాలు జరిగినట్లు మీడియాలో వచ్చాయని.. న్యాయపరమైన పత్రాలను ఫోర్జరీ చేయడం, అమాయకులను దోచుకోవడం, దోపిడీ చేయడం.. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు లక్ష్యంగా జరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. డిజిటల్ అరెస్ట్ నేరాలను పూర్తిస్థాయిలో వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య చర్యలు జరగాలని.. అందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్లుగా ధర్మాసనం పేర్కొంది.

వివరాల్లోకి వెళితే.. 73 సంవత్సరాలకు చెందిన మహిళ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కి లేఖ రాయడంతో ఈ అంశం తెరపైకి వచ్చింది. దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్లను, చదువురాని వారితో పాటు డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రభుత్వ, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలు జరుగుతున్నాయని మీడియా కథనాలను కోర్టు ప్రస్తావించింది. ఇటువంటి నేరపూరిత కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కేంద్ర, రాష్ట్రాల దర్యాప్తు సంస్థలు మధ్య సమన్వయం చేసుకోవాలని చెప్పింది.

## అల్లుఅర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శీలం విజయ్ యాదవ్



వేములవాడ, అక్టోబర్ 17: సినీ నటుడు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శీలం విజయ్ యాదవ్ ను నియమించారు. ఈ సందర్భంగా శీలం విజయ్ యాదవ్ హైదారాబాద్ లో అల్లు అర్జున్ ను మర్యాద పూర్వకంగా కలిసి రాజన్న కండువాతో శాలువాతో సత్కరించి, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ నియామకానికి సహరించిన నిర్మాత బన్నీ వాసు, శరత్, సందీప్, రాష్ట్ర అధ్యక్షులు అంజి ఎస్ కు విజయ్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో రూ.13,430 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన.. ప్రారంభోత్సవం.. కొన్నింటిని జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో దాదాపు రూ.13,430 కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ- తొలుత అహోబిలంలోని నరసింహ స్వామితోపాటు మహానందిలోని శ్రీ మహానందీశ్వర స్వామికి ప్రణామాలు అర్పించారు. అలాగే సకలజన సౌభాగ్యం ఆకాంక్షిస్తూ మంత్రాలయంలోని శ్రీ గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు కోరారు.

అనంతరం ఆయన "సౌరాష్ట్రే సోమనాథం చ శ్రీశైల మల్లికార్జునమ్" అనే ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రంలోని శ్లోకపఠనం చేశారు. దేశంలోని 12 జ్యోతిర్లింగాలలో సోమనాథుడు, మల్లికార్జున స్వామి పేర్లు ఆదిలోనే సంయుక్తంగా కనిపిస్తాయని శ్రీ మోదీ వివరించారు. "సోమనాథుని పవిత్ర భూమి గుజరాత్‌లో జన్మించడం, విశ్వనాథుని పావన కాశీ నగరం నుంచి దేశ సేవ చేయడం, నేడు శ్రీశైల మల్లికార్జున స్వామి దివ్యాశీస్సులు పొందడం నాకు దక్కిన భాగ్యం" అని భక్తిపురస్సరంగా వ్యాఖ్యానించారు. శ్రీశైలం ఆలయంలో పూజల అనంతరం ప్రధానమంత్రి శివాజీ స్ఫూర్తి కేంద్రంలో నివాళి అర్పించి, అటుపైన వేదిక నుంచే ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే అల్లమ ప్రభు, అక్క మహాదేవి వంటి పూజనీయ శైవ సాధువులకు వందనాలు అర్పించారు. ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి, శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమ రావు వంటి నాయకులకు నివాళి అర్పించారు.

ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావిస్తూ "స్వాభిమానం, సంస్కృతికి పట్టుగొమ్మగానే కాకుండా శాస్త్ర విజ్ఞానం- ఆవిష్కరణలకూ కేంద్రంగా ఈ రాష్ట్రం వెలుగొందుతోంది" అని ప్రధాన మంత్రి కొనియాడారు. రాష్ట్రానికి అపార సామర్థ్యం ఉందని, యువతరం ప్రతిభకు ఎల్లలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైనదల్లా- సరైన దృక్కోణం, సమర్థ నాయకత్వమేనని వ్యాఖ్యానించారు. ఆ మేరకు ఇవాళ శ్రీ చంద్రబాబు నాయుడు, శ్రీ పవన్ కల్యాణ్ వంటివారి దార్శనికత నాయకత్వం సహా కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు కూడా రాష్ట్రానికి లభిస్తున్నదని ప్రధానమంత్రి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ గత 16 నెలల నుంచి శరవేగంగా పురోగమిస్తున్నదని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యాన ప్రగతి పథంలో పరుగు తీస్తున్నదని అభివర్ణించారు. ఈ మేరకు సత్వర వృద్ధి దిశగా జాతీయ, రాష్ట్ర రాజధానులు ఢిల్లీ-అమరావతి సంయుక్తంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. దేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందడం తథ్యమని ప్రధాని చెప్పారు. ఈ ఘనత ప్రస్తుత 21వ శతాబ్దపు దేశానికి, 140 కోట్ల మంది పౌరులకే చెందుతుందని శ్రీ మోదీ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా విద్యుత్తు, రైల్వేలు, రహదారులు సహా వాణిజ్య సంబంధిత అనేక ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన, జాతికి అంకితం చేయడం గురించి ఆయన ప్రకటించారు. ఇవన్నీ రాష్ట్రవ్యాప్త అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు పారిశ్రామిక వృద్ధికి దోహదపడుతూ, జనజీవన సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయని చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టులతో కర్నూలు, పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, రాష్ట్ర ప్రజలకు శుభాభినందనలు తెలిపారు.

దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో పయనించాలంటే ఇంధన భద్రత అవశ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా విద్యుత్ రంగంలో సుమారు రూ.3,000 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును ప్రారంభించామని తెలిపారు. దీనివల్ల దేశ ఇంధన సామర్థ్యం కూడా ఇనుమడిస్తుందని, ప్రస్తుత సత్వర అభివృద్ధి నేపథ్యంలో గతకాలపు దుస్థితిని విస్మరించరాదని ప్రజలకు సూచించారు. దేశంలో 11 ఏళ్లకిందట నేటి ప్రతిపక్ష కేంద్ర ప్రభుత్వ హయాంలో తలసరి విద్యుత్ వినియోగం 1,000 యూనిట్లకన్నా తక్కువేనని గుర్తుచేశారు. అలాగే దేశవ్యాప్తంగా విద్యుత్ రంగంలో సరఫరా కోత వంటి సవాళ్లు నిత్యం వేధించేవని శ్రీ మోదీ పేర్కొన్నారు. వేలాది గ్రామాలకు ప్రాథమికంగా విద్యుత్ స్తంభాలు కూడా ఉండేవి కావని చెప్పారు. అలాంటి దురవస్థ నుంచి నేడు కాలుష్య రహిత ఇంధనం నుంచి మొత్తం ఉత్పాదన దాకా అన్ని రంగాల్లోనూ భారత్ కొత్త రికార్డులను సృష్టిస్తోందని ఆయన వెల్లడించారు. ఇవాళ ప్రతి గ్రామానికీ విద్యుత్ సదుపాయం చేరువ కాగా, తలసరి వినియోగం 1,400 యూనిట్లకు పెరగడంతోపాటు పరిశ్రమలు- గృహాలకు విద్యుత్తు సరఫరాలో కొరత మాటే లేదని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

భారత్ ఇంధన విప్లవ విజయంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన కూడలిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. శ్రీకాకుళం నుంచి అంగుల్ దాకా సహజ వాయువు పైప్‌లైన్ ప్రాజెక్టును ప్రారంభించడాన్ని ఆయన ఉటంకించారు. దీనిద్వారా దాదాపు 15 లక్షల గృహాలకు గ్యాస్ సరఫరా అవుతుందని తెలిపారు. చిత్తూరులో రోజువారీగా 20 వేల సిలిండర్ల సామర్థ్యంతో ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌ను ఆయన ఇవాళ ప్రారంభించారు. ఈ సదుపాయం వల్ల స్థానిక రవాణా, నిల్వపరంగా ఉపాధి లభిస్తుందని, యువతకు కొత్త అవకాశాలు అందివస్తాయని పేర్కొన్నారు.

"దేశమంతటా బహుళ రవాణా మౌలిక సదుపాయాలు వేగంగా వృద్ధి చెందడంతోపాటు గ్రామాల నుంచి నగరాలకు, నగరాల నుంచి ఓడరేవులకు అనుసంధాన కల్పనపై మేం నిశితంగా దృష్టి సారించాం" అని ప్రధానమంత్రి చెప్పారు. ఇందులో భాగంగా సబ్బవరం-షీలానగర్ మధ్య నిర్మించిన కొత్త రహదారితో అనుసంధానం మరింత మెరుగవుతుందని ఆయన అన్నారు. రైల్వేలకు సంబంధించి కొత్త మార్గాల ప్రారంభం, రైలు ఫ్లైఓవర్ల నిర్మాణంతో నవశకం మొదలైందని పేర్కొన్నారు. తద్వారా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ఈ ప్రాంత పరిశ్రమలకు నవ్యోత్తేజం లభిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

దేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందాలన్న లక్ష్యానికి ప్రభుత్వం, ప్రజానీకం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ సంకల్పాన్ని స్వర్ణాంధ్ర దార్శనికత మరింత శక్తిమంతం చేయగలదని ప్రధానమంత్రి అన్నారు. ఈ రాష్ట్రంతోపాటు యువతరం కూడా సాంకేతికంగా నిత్యం ముందంజ వేస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ మరింతగా పెంచుకుంటున్నాయని వ్యాఖ్యానించారు.

"వేగం, పరిమాణం రీత్యా భారత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ వైపు ప్రపంచం నేడు దృష్టి సారిస్తోంది" అని శ్రీ మోదీ ప్రకటించారు. రెండు రోజుల కిందట ఈ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు గూగుల్ ప్రకటించడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు భారత్‌లో తన తొలి కృత్రిమ మేధ (ఏఐ) కూడలిని ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు చేయబోతున్నదని వెల్లడించారు. తద్వారా శక్తిమంతమైన 'ఏఐ' మౌలిక సదుపాయాలు, విస్తృత డేటా సెంటర్ సామర్థ్యం, పెద్ద ఎత్తున ఇంధన వనరులు సహా విస్తృత ఫైబర్-ఆప్టిక్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తాయని ప్రధానమంత్రి వివరించారు.

గూగుల్ సంస్థ పెట్టుబడి పెట్టే 'ఏఐ' కూడలి ప్రాజెక్టులో కొత్త అంతర్జాతీయ 'సబ్‌సీ గేట్‌వే' (సముద్ర గర్భ కేబుల్ నెట్‌వర్క్) నిర్మాణం కూడా భాగంగా ఉంటుందని ప్రధానమంత్రి ప్రకటించారు. దీనిద్వారా విశాఖపట్నంలోని భారత తూర్పు తీరానికి బహుళ అంతర్జాతీయ 'సబ్‌సీ కేబుళ్లు' విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో విశాఖపట్నం 'ఏఐ'కి, అంతర్జాతీయ అనుసంధానానికి ప్రధాన కేంద్రం కాగలదని చెప్పారు. ఇది దేశానికేగాక యావత్ ప్రపంచానికీ సేవలందిస్తుందని పేర్కొంటూ- ఈ ప్రాజెక్టు సాధనలో రాష్ట్రం విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

భారత ప్రగతికి ఆంధ్రప్రదేశ్ పురోగమనం అత్యంత అవశ్యమని, అదే తరహాలో రాష్ట్ర ప్రగతికి రాయలసీమ అభివృద్ధి ఎంతో ముఖ్యమని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు గడ్డపై నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లాలో ఉపాధి, శ్రేయస్సుకు కొత్త బాటలు వేస్తాయని, తద్వారా సీమలో పారిశ్రామిక వృద్ధి వేగం పుంజుకుంటుదని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వేగిరపరచే దిశగా కొత్త పారిశ్రామిక కారిడార్లు, కేంద్రాల ఏర్పాటు ఎంతైనా అవసరమని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఓర్వకల్, కొప్పర్తిని రాష్ట్రానికి కొత్త పారిశ్రామిక గుర్తింపు కేంద్రాలుగా ప్రభుత్వం రూపొందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెరుగుతూ నిరంతర కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని తెలిపారు.

"ప్రపంచం నేడు భారత్‌ను 21వ శతాబ్దపు కొత్త తయారీ కూడలిగా గుర్తిస్తోంది. స్వయం సమృద్ధ భారత్ దృక్కోణమే ఈ విజయానికి పునాది" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. అలాగే ఈ దిశగా భారత్ ముందంజలో ఆంధ్రప్రదేశ్ కీలక సహకార శక్తిగా ఎదుగుతున్నదని వివరించారు. గత ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని నిర్లక్ష్యం చేశాయని, దీంతో మొత్తంగా దేశానికి ఎదురుదెబ్బ తగిలిందని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ ప్రగతికి సారథ్యం వహించగల రాష్ట్రం ఒకనాడు స్వీయాభివృద్ధి కోసం పోరాడాల్సిన దుస్థితిలో పడిందని వ్యాఖ్యానించారు. అయితే, తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఉత్పాదక రంగం వేగంగా వృద్ధి సాధించిందని చెప్పారు. తద్వారా పురోగమన పథం కొత్త పుంతలు తొక్కుతున్నదని, ఇది తనకెంతో సంతృప్తినిస్తున్నదని తెలిపారు. నిమ్మలూరులో 'అడ్వాన్స్‌డ్ నైట్ విజన్' కర్మాగారాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా ఇది మరో ముందడుగని, తద్వారా 'నైట్ విజన్ పరికరాలు, క్షిపణి సెన్సర్లు, డ్రోన్ రక్షణ వ్యవస్థల' ఉత్పాదనలో దేశ సామర్థ్యం ఇనుమడిస్తుందని తెలిపారు. అంతేగాక రక్షణ ఎగుమతులు ఉన్నత శిఖరాలకు చేరుతాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా స్వదేశీ ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలను, సాధించిన విజయాలను యావత్ ప్రపంచం ప్రత్యక్షంగా చూసిందని ఆయన వ్యాఖ్యానించారు.

కర్నూలును భారతదేశ డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంకల్పం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రధానమంత్రి.. కర్నూలు, ఆంధ్ర అంతటా డ్రోన్ పరిశ్రమ నుంచి భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాలతో ముడిపడి ఉన్న అనేక కొత్త రంగాలు ఉద్భవిస్తాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో డ్రోన్ల ఉపయోగాన్ని ప్రస్తావించిన ప్రధాని.. రాబోయే సంవత్సరాల్లో డ్రోన్ల విభాగంలో కర్నూలు జాతీయ శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు జీవన సౌలభ్యాన్ని అందించేందుకు ఉద్దేశించిన సంస్కరణల గురించి మాట్లాడుతూ.. ప్రజా కేంద్రీకృత అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను పునరుద్ఘాటించారు. రూ. 12 లక్షల వరకు ఆదాయానికి ఎలాంటి పన్ను లేదన్న ఆయన.. అందుబాటు ధరల్లో మందులు, తక్కువ ఖర్చుతో కూడిన ఆరోగ్య సంరక్షణ, వృద్ధుల కోసం ఆయుష్మాన్ కార్డులు వంటి కార్యక్రమాలు జీవన సౌలభ్యంలో కొత్త అధ్యాయానికి నాంది పలికాయని అన్నారు.

భారీగా తగ్గిన జీఎస్టీ రేట్లు నవరాత్రి మొదటి రోజు నుంచే అమల్లోకి వచ్చాయని ప్రధానమంత్రి అన్నారు. నారా లోకేష్ గారి నేతృత్వంలో జీఎస్టీ బచత్ ఉత్సవాన్ని వీక్షించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. "సూపర్ జీఎస్టీ - సూపర్ పొదుపు'' ప్రచారాన్ని విజయవంతంగా ప్రారంభించడం పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు రూ. 8,000 కోట్లకు పైగా ఆదా చేసుకోవటంతో పండుగ వాతావరణం మరింత మెరుగుపడిందని తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్'కు అనుగుణంగా జీఎస్టీ పొదుపు పండుగను జరుపుకోవాలని ప్రధానమంత్రి కోరారు. అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ ద్వారా వికసిత్ భారత్ అనే కల సాకారం అవుతుందని పేర్కొంటూ ఆయన ప్రసంగాన్ని ముగించారు. కొత్త ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రజలకు మరోసారి అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ సయ్యద్ అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు.. కేంద్ర కేబినెట్ మంత్రులు శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ.. ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు దాదాపు రూ. 13,430 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. పరిశ్రమలు, విద్యుత్ సరఫరా, రోడ్లు, రైల్వేలు, రక్షణ తయారీ, పెట్రోలియం, సహజ వాయువు వంటి కీలక రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు.. ప్రాంతీయ మౌలిక సదుపాయాలను పెంపొందించడం, పారిశ్రామికీకరణను వేగవంతం చేయడం, రాష్ట్రంలో సమ్మిళిత సామాజిక-ఆర్థిక వృద్ధిని సాధించాలన్న ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తున్నాయి.

కర్నూలు-ఎ.ఎ పూలింగ్ స్టేషన్‌లో రూ.2,880 కోట్లకు పైగా వ్యయంతో ఏర్పాటు చేసిన సరఫరా వ్యవస్థను మెరుగుపరిచే ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 765 కేవీ డబుల్-సర్క్యూట్ కర్నూలు-ఎ.ఎ పూలింగ్ స్టేషన్- చిలకలూరిపేట విద్యుత్ సరఫరా లైన్ నిర్మించనున్నారు. ఇది కరెంట్ సరఫరా సామర్థ్యాన్ని 6000 ఎంవీఏలు పెంచుతుంది. దేశాభివృద్ధిలో కీలకమైన పునరుత్పాదక విద్యుత్ సరఫరాను భారీ ఎత్తున మెరుగుపరుస్తుంది.

ప్రధానమంత్రి కర్నూలులోని ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతం, కడపలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతానికి శంకుస్థాపన చేశారు. రూ. 4,920 కోట్లకు పైగా వ్యయంతో చేపడుతోన్న ఈ రెండింటిని.. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ), ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థల (ఏపీఐఐసీ) ఉమ్మడి వెంచర్ అభివృద్ధి చేస్తోంది. పలు రంగాల్లో కార్యకలాపాలు నిర్వహించే ఈ ప్రాజెక్టులను వాక్-టు-వర్క్ పద్ధతిలో ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలతో ఆధునిక, ఆవిష్కరణ ఆధారిత తయారీ కేంద్రాలుగా రూపొందించారు. ఇవి రూ. 21,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించటం, సుమారు 1 లక్ష ఉద్యోగాలను సృష్టించడం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వృద్ధి, ప్రపంచ పోటీతత్వాన్ని పెంచుతాయన్న అంచనా ఉంది.

రోడ్డు రవాణా మౌలిక సదుపాయాలను పెంచే చర్యల్లో భాగంగా సబ్బవరం నుంచి షీలానగర్ వరకు రూ. 960 కోట్ల విలువైన 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి గౌరవ ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఇది విశాఖపట్నంలో రద్దీని తగ్గించటంతో పాటు వాణిజ్యం, ఉపాధి అవకాశాలను పెంచుతుంది. దీనితో పాటు రూ. 1140 కోట్ల విలువైన 6 ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. పీలేరు నుంచి కలూర్ విభాగాన్ని (భాక్రాపేట వరకు) నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసిన రహదారి, కడప లేదా నెల్లూరు సరిహద్దు నుంచి సీఎస్ పురం వరకు వెడల్పు చేసిన రహదారి, గుడివాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్-165 విభాగంలో గుడివాడ - నూజెల్ల రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు వరుసల ఆర్ఓబీ, ఎన్‌హెచ్-716 రహదారిలో పాపాగ్ని నదిపై నిర్మించిన భారీ వంతెన, ఎన్‌హెచ్-565లో కనిగిరి బైపాస్, ఎన్. గుండ్లపల్లి పట్టణంలో ఎన్‌హెచ్-544 డీడీలో మెరుగుపరిచిన బైపాస్‌లు ఇందులో ఉన్నాయి. ఇవి భద్రతను మెరుగుపరచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించటంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అనుసంధానను మెరుగుపరుస్తాయి.

ప్రధానమంత్రి రూ. 1,200 కోట్ల విలువైన అనేక కీలక రైల్వే ప్రాజెక్టులలో కొన్నింటికి శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని జాతికి అంకితం చేశారు. కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వే లైన్, పెందుర్తి- ఉత్తర సింహాచలం మధ్య రైల్వే ఫ్లైఓవర్లకు శంకుస్థాపన చేశారు. కొత్తవలస-బొడ్డవర విభాగం, శిమిలిగూడ-గోరాపూర్ విభాగాల డబ్లింగ్‌ను జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులు రద్దీని తగ్గించటంతో పాటు వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తాయి. ఆటంకం లేని ప్రయాణికులతో పాటు సరకు రవాణాకు వీలు కల్పిస్తాయి. ఈ ప్రాంతం మొత్తం పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక వృద్ధిని ప్రోత్సహిస్తాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తాయి.

ఇంధన విభాగంలో ఆంధ్రప్రదేశ్‌లో 124 కి.మీ, ఒడిశాలో 298 కి.మీ పొడవున్న గెయిల్ (ఇండియా) లిమిటెడ్‌కు చెందిన శ్రీకాకుళం - అంగుల్ సహజ వాయువు పైప్‌లైన్‌ను (మెయిన్‌లైన్) కూడా గౌరవ ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. దీన్ని రూ. 1,730 కోట్ల పూర్తి వ్యయంతో నిర్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో ఇండియన్ ఆయిల్‌కు చెందిన 60 టీఎంటీపీఏ (సంవత్సరానికి వెయ్యి మెట్రిక్ టన్నులు) ఎల్పీజీ బాట్లింగ్ కేంద్రాన్ని కూడా గౌరవ ప్రధానమంత్రి ప్రారంభించారు. రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఎల్పీజీ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని 4 జిల్లాలు, తమిళనాడులోని 2 జిల్లాలు, కర్ణాటకలోని 1 జిల్లాల్లో 7.2 లక్షల మందికి పైగా వినియోగదారులకు 80 పంపిణీదారుల ద్వారా సేవలందించనుంది. గృహాలు, వ్యాపార సంస్థలకు స్థిరమైన, విశ్వసనీయమైన ఎల్పీజీ సరఫరా ఉండేలా చూసుకోవటంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది.

రక్షణ రంగ తయారీని పెంచే చర్యల్లో భాగంగా కృష్ణాజిల్లాలోని నిమ్మలూరులో రూ. 362 కోట్ల పెట్టుబడితో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఏర్పాటు చేసిన రాత్రి చూసేందుకు ఉపయోగపడే ఉత్పత్తుల అధునాతన కర్మాగారాన్ని (ఏఎన్వీపీఎఫ్- అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ) ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. ఈ కర్మాగారం భారత రక్షణ దళాలకు కావాల్సిన అధునాతన ఎలక్ట్రో-ఆప్టికల్ వ్యవస్థలను తయారు చేస్తుంది. ఇది రక్షణ తయారీలో స్వావలంబనను బలోపేతం చేయటంతో పాటు ఈ ప్రాంతంలో నైపుణ్య ఆధారిత ఉపాధిని ప్రోత్సహిస్తుంది.

# కలెక్టర్‌కు దివ్యాంగులు, వృద్ధుల మొర

**-జెడ్పీలో స్వాభిమాన్ దివ్యాంగుల గ్రీవెన్స్**
**-ఇప్పటి వరకు 169 దరఖాస్తులు స్వీకరించాం**
**-కొందరికి పింఛన్లు కూడా మంజూరయ్యాయి**
**-శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

శ్రీకాకుళం, అక్టోబర్ 17: సారూ.. దయచూపి పింఛన్ మంజూరు చేయరూ.. అంటూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు దివ్యాంగులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు మొర



పెట్టుకున్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ లో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొని అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ప్రతీ మూడవ శుక్రవారం స్వాభిమాన్ దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంత వరకు నిర్వహించిన 11 శుక్రవారాల గ్రీవెన్స్ లో 169 అర్జీలు స్వీకరించినట్లు వివరించారు. ఇందులో కొందరికి పింఛన్ కూడా మంజూరైనట్లు తెలిపారు. ఇంత వరకు వచ్చిన అర్జీలలో పెన్షన్లు, మెడికల్, చిన్న చిన్న భూ సమస్యలు, బ్యాటరీ ట్రై సైకిల్స్, ట్రై సైకిల్స్, వినికి యంత్రాలు, తదితర వాటిపై వచ్చినట్లు తెలిపారు. మెడికల్ సమస్యలకు సంబంధించి జీజీహెచ్, డీసీహెచ్ వారితో అక్కడికక్కడే పరిష్కారానికి ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించే స్వాభిమాన్ కు 11 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సత్య నారాయణ పాల్గొన్నారు.

# దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోండి...

**-బాణాసంచా విక్రయాల్లో అప్రమత్తత అవసరం**
**-టపాసులు విక్రయాల్లో జాగ్రత్తలు పాటించండి**
**-ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగ కుండ చర్యలు చేపట్టండి**
**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

వరంగల్, క్టోబర్ 17:బాణసంచా అమ్మకంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ విక్రేతలకు సూచించారు. బాణసంచా అమ్మకాలలో నిర్లక్ష్యం,



బాధ్యతారాహిత్యాన్ని సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

భద్రత, రక్షణ, సంరక్షణ విషయంలో రాజీ పడకూడదన్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని పటాకుల విక్రేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో అగ్నిమాపక, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. బాణసంచా అమ్మే వారందరూ తప్పనిసరిగా పర్మిట్లు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. పర్మిట్ల కోసం, వ్యాపారస్తులు ముందుగా అగ్నిమాపక శాఖ అధికారుల నుండి నాన్-డిస్‌క్లోజర్ సర్టిఫికెట్ పొందాలి.

అలాగే వ్యాపారస్తులు సంబంధిత స్థల యజమాని నుండి అనుమతి పత్రాన్ని తీసుకోవాలని, ప్రభుత్వ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేస్తుంటే సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి అనుమతి పొందాలని కూడా ఆయన గుర్తు చేశారు. భవనాల్లో వ్యాపారాలు నిర్వహించాలనుకునే వారు ముందుగా భవనం ఇరువైపులా ఉన్న ఇంటి యజమానుల అనుమతితో, భవన బ్లూప్రింట్, ఎనిమిది వందల రూపాయల ప్రభుత్వ బ్యాంకు డ్రాఫ్ట్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముఖ్యంగా, విక్రేతలు అగ్ని ప్రమాదాలను నివారించడానికి.. అమ్మకాలు నిర్వహించే ప్రదేశంలో ఇసుక, నీరు, ఇతర అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. వీలైనంత వరకు, వ్యాపారవేత్తలు ఇరుకైన ప్రదేశాలలో కాకుండా విశాలమైన ప్రాంతాలలో తమ వ్యాపారాన్ని నిర్వహించుకోవాలని సూచించారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోని వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని బాణసంచా వ్యాపారుల వల్ల ఎటువంటి నష్టం లేదా ప్రమాదాలు జరగకుండా చూసుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యం అని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు.

ప్రధానంగా ఎటువంటి అనుమతి లేకుండా బాణసంచా వ్యాపారం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారని ఆయన అన్నారు. పర్మిట్లు లేకుండా బాణసంచా వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఎవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసులను కోరారు.

ఇక దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా బాణసంచా కాల్చేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దలు వారితోనే ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకుని, ఆనందం, వేడుకల మధ్య దీపావళి జరుపుకోవాలని కోరుతున్నా అని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు.

ఈసమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారులు సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అదనపు డీసీపీ రవి, వరంగల్ ఏఎస్పీ శుభంతో పాటు ఏసీపీలు డాక్టర్ జితేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నర్సింహారావు, ఇన్స్ పెక్టర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సకు ఎల్ఓసీ మంజూరు..

వరంగల్, అక్టోబర్ 17:వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న బాధితుడికి అండగా నిలిచారు. ఆర్థికంగా చితికిపోయి వైద్యం కోసమై అల్లాడుతున్న అభాగ్యుడి కోసం నేనున్నానంటూ భరోసా కల్పించారు.

హనుమకొండ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీ నివాసి, క్యాన్సర్ చికిత్స పొందుతున్న మహ్మద్ అదీల్ అహ్మద్‌కు ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.4 లక్షలు మంజూరు చేస్తూ ఎల్ఓసి చెక్కును అందజేశారు.

ఈ సందర్భముగా బాధిత కుటుంబసభ్యులు ఎంపీ డా. కడియం కావ్యకు కృతజ్ఞతులు తెలియచేశారు. ఆపదలో ఉన్న అభాగ్యులకు అండదండగా నిలువాడానికి విశాల హృదయులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తోడ్పాటునందించాలని ఎంపీ డా.కావ్య కోరారు.

# రైతుల ఖాతాల్లో 72 గంటల్లో చెల్లింపు

**-రైతులు సన్నధాన్యాన్ని పండించాలి**
**-రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్గొండ, అక్టోబర్ 17: ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులను 72 గంటలు జమ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం, కంకణాలపల్లి ,అంతాయ గూడెం, మామిడాలపల్లి గ్రామాలలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

అంతేగాక కంకణాలపల్లి లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. తిప్పర్తి మండల కేంద్రంలో దాన్యాన్ని తరలించే లారీలను జండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మాట్లాడుతూ.. రైతుల కళ్ళల్లో సంతోషాన్ని చూడడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

అందుకే ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు చెల్లించేందుకుగాను 25వేల కోట్ల రూపాయలను క్యాబినెట్ కేటాయించినట్లు వెల్లడించారు. రైతులు ధాన్యం అమ్మిన డబ్బుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదని, 72 గంటల్లో వారి ఖాతాలలో జమ చేస్తామని, ఒకవేళ డబ్బులు జమ కాకుంటే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చు అని తెలిపారు.

రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా అత్యధికంగా ధాన్యం పండించే రెండవ జిల్లాగా నిలిచిందని, అయితే రైతులు సన్న ధాన్యాన్ని ఎక్కువగా పండించాలని, ఈ దిశగా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు.

ధనవంతుల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పెదలందరికి రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నదని, అందువల్ల సన్నబియాని ఎక్కువగా పండించాలన్నారు.

నిజామాబాద్ జిల్లాలో 75% సన్న బియ్యం పండిస్తున్నారని, అందువల్ల నల్గొండ జిల్లాలో సైతం సన్నబియ్యనికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగా ఆర్ అండ్ - శాఖ ద్వారా 6600 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టామని,4500 కోట్ల రూపాయలకు ఇటీవలే క్యాబినెట్ అనుమతి తీసుకున్నామని త్వరలోనే టెండర్లు పిలిచి జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు,గ్రామాల నుండి మండలాలకు సింగిల్ రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, ఇందుకు క్యాబినేట్ కూడ అనుమతించడం జరిగిందని ఆయన వెల్లడించారు.

రహదారి, రవాణా సౌకర్యం బాగున్నప్పుడే రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్ కు తీసుకు వెళ్ళేందుకు వీలు కలుగుతుందని ఆయన తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా పేదలకు 7 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని, 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని ,గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు.

తిప్పర్తి మండల కేంద్రంలో దాన్యం లారీలకు జండా ఊపి ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం మిల్లులు తరలించడం, ట్రాన్స్పోర్ట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,ఇందుకుగాను ట్రాన్స్పోర్ట్ యజమానులు, లారీల యజమానులు సహకరించాలని, నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల ద్వారా తరలించాలని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడారు.

అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి , డి ఎస్ ఓ వెంకటేష్,పౌర సరఫరాల డి ఎం గోపికృష్ణ ,డి సి ఓ పత్యానాయక్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, పాశం రాంరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు

## –కోడెలను వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించాలి

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17:(నేటినిజం ప్రతినిధి): రాజన్న భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు ఉచిత కోడెల పంపిణీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోడెలను రైతులకు పంపిణీ చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్వామివారికి కోడెను కట్టే సంస్కృతి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉందన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా కోడె మొక్కు చెల్లింపు నిలుస్తుందన్నారు.



తిప్పాపూర్ గోశాలలో రైతులకు ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు నేరుగా కోడెలను పంపిణీ చేయడం వలన వారికి వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారన్నారు. రైతులు కోడెలను చక్కగా చూసుకుంటూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. రైతులకు పంపిణీ చేసిన కోడెలను అప్పుడప్పుడు పరీక్షిస్తున్నామని, వాటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వేములవాడలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల్లో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. 40 ఎకరాల విస్తీర్ణంలో అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రాజన్నకు కోడె మొక్కులు చెల్లించే వారు పాలు మరిచిన తర్వాత కోడెలను అందజే యాలన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దూరదర్శన్, ఆకాశవాణిలో ఉచిత ప్రసారానికిగాను జాతీయ పార్టీలకూ, రాష్ట్ర స్థాయి పార్టీలకూ డిజిటల్ వౌచర్లు కేటాయించిన భారత ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:బిహార్ విధానసభకు ఈ సంవత్సరం జరగనున్న సాధారణ ఎన్నికల్లో జాతీయ పార్టీలతో పాటు, రాష్ట్ర స్థాయికి చెందిన గుర్తింపు గల రాజకీయ పక్షాలకు దూరదర్శన్, ఆకాశవాణి (ఏఐఆర్)లలో ప్రసారాలకు సమయాన్ని కేటాయించడానికి సంబంధించిన ఆదేశాలను భారత ఎన్నికల సంఘం జారీ చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951లో 39ఏ సెక్షన్ ప్రకారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

అసెంబ్లీ ఎన్నికల కోసం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పక్షాలకు డిజిటల్ టైం వౌచర్లను ఓ ఐటీ వేదిక సాయంతో జారీ చేశారు.

బిహార్లో ఎన్నికల్లో ప్రతి దశకూ సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రచురణ పూర్తయిన తేదీ మొదలు మరో రెండు రోజుల్లో పోలింగ్ ఉంటుందనగా.. ఈ రెండు తేదీల మధ్య కాలంలో బ్రాడ్‌కాస్ట్, టెలికాస్ట్‌ల అవకాశాన్ని ఇస్తారు. రాజకీయ పక్షాల అధీకృత ప్రతినిధులు, బిహార్ సీఈఓ కార్యాలయ అధికారుల సమక్షంలో లాటరీని నిర్వహించి బ్రాడ్‌కాస్ట్, టెలికాస్ట్ కాలపట్టికలను ఖరారు చేస్తారు.

ఈ పథకంలో, కనీసం 45 నిమిషాల పాటు దూరదర్శన్, ఆలిండియా రేడియో.. ఈ రెంటిలోనూ ఉచిత బ్రాడ్‌కాస్ట్, టెలికాస్ట్ సౌకర్యాన్ని ప్రతి రాజకీయ పక్షానికి కేటాయించారు. రాష్ట్రంలో ప్రాంతీయ నెట్‌వర్క్‌లో ప్రతి పార్టీకీ సమాన ప్రాతిపదికన ఈ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచుతారు.

బిహార్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సాధించిన సీట్లను బట్టి అదనపు సమయాన్ని కేటాయించారు.

రాజకీయ పక్షాలు మార్గదర్శక సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రసంగాల రాతప్రతులు, రికార్డింగులను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. రికార్డింగులను ప్రసార భారతి సాంకేతిక ప్రమాణాలకు తగ్గట్లు న్యూఢిల్లీ స్టూడియోల్లో లేదా దూరదర్శన్, ఏఐఆర్ కేంద్రాల్లో రూపొందించవచ్చు.

పార్టీ ప్రసారాలకు అదనంగా, ప్రసార భారతి సంస్థ దూరదర్శన్‌లోనూ, ఆకాశవాణిలోనూ రెండుకు మించని బృంద చర్చలు, లేదా చర్చ కార్యక్రమాలు లేదా ఈ రెండు రకాల కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తుంది. అర్హత కలిగిన ప్రతి రాజకీయ పక్షం ఒక ప్రతినిధిని నామినేట్ చేయవచ్చు. ఆయా పక్షాలు అంగీకారం తెలిపిన ఒక సమన్వయకర్త ఈ కార్యక్రమంలో మధ్యవర్తి పాత్రను పోషిస్తారు.

# మొదటి త్రైమాసికంలో 7.8% జీడీపీ వృద్ధితో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని నిలబెట్టుకున్న భారత్: శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:భారతదేశ బలమైన ఆర్థిక వృద్ధిని, బ్రెజిల్‌తో మరింతగా బలపడుతున్న ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. ఈ రోజు జరిగిన భారత్, బ్రెజిల్ వ్యాపార సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సమావేశంలో పాల్గొన్నందుకు బ్రెజిల్ ఉపాధ్యక్షుడు గెరాల్డో అల్క్‌మిన్, రక్షణ మంత్రి, జోస్ మ్యుసియో మాంటెరో ఫిల్హోలకు శ్రీ గోయల్ కృతజ్ఞతలు తెలిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న నిబద్ధతను ఈ పర్యటన ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు.

ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం జరుపుకుంటున్న సందర్భాన్ని ప్రస్తావిస్తూ, రెండు ప్రముఖ వ్యవసాయ ఉత్పత్తి దేశాలైన భారత్, బ్రెజిల్ ప్రపంచ ఆహార భద్రతకు గణనీయంగా దోహదపడుతున్నాయని శ్రీ గోయల్ అన్నారు. ఈ చర్చల ద్వారా వ్యవసాయ వ్యాపారం, ఆహార ప్రాసెసింగ్ రంగాల్లో సహకారం మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని ఉటంకిస్తూ... "భారత్, బ్రెజిల్ సంబంధాలు కార్నివాల్ అంత రంగులమయంగా, ఫుట్‌బాల్ అంత ఉత్సాహభరితంగా" ఉండాలని శ్రీ గోయల్ అన్నారు. బ్రెజిల్ తమ ఆరోగ్య వ్యవస్థల్లో యోగాను, ఆయుర్వేదాన్ని భాగంగా చేర్చినందుకు ఆయన అభినందించారు. సంప్రదాయ విజ్ఞానం, ఆరోగ్య సంరక్షణ పద్ధతులు రెండు దేశాల మధ్య సాంస్కృతిక, ఆరోగ్య సహకారాన్ని మరింత బలవరచగలవని ఆయన పేర్కొన్నారు.

భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి సాధించిందని, గత నాలుగు సంవత్సరాలుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ వేగం కనీసం వచ్చే రెండు దశాబ్దాల పాటు కొనసాగుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ అభివృద్ధి గాథ మూడు బలమైన స్తంభాలపై ఆధారపడి ఉందని శ్రీ గోయల్ ఉద్ఘాటించారు. పటిష్టమైన స్థూల ఆర్థిక పునాదులను అభివృద్ధి చేయడం మొదటి మూలస్తంభమనీ, ప్రభుత్వం తక్కువ ద్రవ్యోల్బణాన్ని కొనసాగిస్తూ, స్థిరమైన వృద్ధిని సాధించిందని పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేసిందని, ప్రపంచంలోనే అత్యంత బలమైన విదేశీ మారక నిల్వలను కలిగి ఉందని చెప్పారు. 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలతో, ఫారెక్స్ పటిష్టతలో ప్రపంచంలోని మొదటి ఐదు దేశాలలో భారత్ ఒకటిగా ఉందని అన్నారు. ఈ బలమైన స్థూల ఆర్థిక పునాదులు దేశం తన ప్రతిష్ఠాత్మక వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు, తన అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేసేందుకు ఒక ఆధారాన్ని అందిస్తున్నాయని ఆయన తెలిపారు.

రెండో స్తంభం, ఆధునిక, నాణ్యమైన మౌలిక సదుపాయాలను దేశంలోని మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లడంపై దృష్టి పెట్టిందని శ్రీ గోయల్ పేర్కొన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు పోటీతత్వానికి పునాది అని, భారతదేశం అంతటా సమానమైన వృద్ధికి చోదక శక్తిగా ఉంటాయని ఆయన అన్నారు. మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు కనెక్టివిటీని మెరుగుపరచడం, రవాణా ఖర్చులను తగ్గించడమే కాకుండా, వ్యాపారాలను విస్తరించే సామర్థ్యాన్ని, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యాన్ని కూడా బలోపేతం చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ పెట్టుబడులు యువతీ యువకులకు దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడానికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, అంకుర పరిశ్రమలకు మద్దతు ఇవ్వడానికి, వ్యాపారాలకు, ఆవిష్కరణలకు కొత్త మార్గాలను తెరవడానికి అవకాశాలను అందిస్తాయని తెలిపారు. గత దశాబ్ద కాలంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యాలలో ఒకటిగా ఉందని శ్రీ గోయల్ పేర్కొన్నారు.

భారత వృద్ధి గాథలో మూడవ స్తంభం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారించిందని మంత్రి అన్నారు. ప్రభుత్వం మధ్యతరగతిపై ఆదాయ పన్ను భారాన్ని తగ్గించిందని, వ్యాపార ప్రక్రియలను సులభతరం చేయడానికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)వ్యవస్థను సరళీకృతం చేసిందని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 22న అమలులోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణలు పన్ను రేట్లను గణనీయంగా తగ్గించాయని, వాటిని పాటించడం మెరుగుపడిందని తెలిపారు. ఈ చర్యలు పౌరులకు అధిక వ్యయ సామర్థ్యాన్ని, వారి కుటుంబాలకు మెరుగైన జీవన నాణ్యతను అందిస్తాయని శ్రీ గోయల్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిరంతర ప్రయత్నాలు ప్రతి ఒక్కరూ ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు పొందేలా, అభివృద్ధి సమ్మిళితంగా, విస్తృతంగా ఉండేలా చూడటమే లక్ష్యంగా పెట్టుకున్నాయని ఆయన స్పష్టం చేశారు.

భారత సాహసోపేతమైన సంస్కరణలను ప్రశంసిస్తూ ఐఎంఎఫ్ అధిపతి ఇటీవల చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ, 2025 సంవత్సరానికి భారతదేశ వృద్ధి అంచనాను ఐఎంఎఫ్ 6.4 శాతం నుంచి 6.6 శాతానికి సవరించిందని శ్రీ గోయల్ తెలిపారు. గత 12 ఏళ్లలో 250 మిలియన్లమంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని, ఇది ఇప్పుడు దేశ వినియోగం, వృద్ధి గాథను నడిపించే బలమైన, ఆకాంక్షపూరిత కొత్త మధ్యతరగతిని సృష్టించిందని ఆయన పేర్కొన్నారు.

ప్రతి పౌరుడికి ఆహారం, గృహవసతి, విద్య, ఆరోగ్య సంరక్షణ, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉండేలా, మరింత సమగ్రమైన, స్థిరమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించడానికి భారతదేశ సంక్షేమ, మౌలిక సదుపాయాల పెట్టుబడులను సమన్వయపరచినట్టు మంత్రి చెప్పారు.

నిర్మాణాత్మక సంస్కరణలు, వ్యాపార సౌలభ్యం, షరతుల భారాలను తగ్గించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను శ్రీ గోయల్ పునరుద్ఘాటించారు. ఈ ప్రయత్నాలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేశాయని, సమీప భవిష్యత్తులో భారత్ ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు సన్నద్ధం చేస్తున్నాయని చెప్పారు. 2047 నాటికి 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే భారత్ లక్ష్యం 140 కోట్ల మంది పౌరుల సామూహిక సంకల్పంతో ముందుకు సాగుతోందని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. సమ్మిళిత వృద్ధి, ప్రపంచ సహకారం, అభివృద్ధి చెందిన, వర్ధమాన ఆర్థిక వ్యవస్థలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యాలను విస్తరించడానికి భారతదేశం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

శ్రీ గోయల్ తన ప్రసంగాన్ని ముగిస్తూ, "చెట్లను నాటకుండా ఎవరూ ఫలాలను పొందలేరు" అని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా చెప్పిన మాటలను ఉటంకించారు. దీర్ఘకాలిక వృద్ధి, భాగస్వామ్యానికి భారత్ బీజాలు వేసిందని, భారత్, బ్రెజిల్ మధ్య స్నేహం ఇరు దేశాలకు సుస్థిర సౌభాగ్యాన్ని అందిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పండుగల వేళ ప్రత్యేక రైళ్లు ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులు శుభవార్త చెప్పింది. పండుగల రద్దీని దృష్టిలో పెట్టుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. రద్దీకి అనుగుణంగా సికింద్రాబాద్ నుంచి తిరుపతి, విజయవాడ, నాంపల్లి నుంచి భువనేశ్వర్, యశ్వంత్‌పూర్ నుంచి దర్భంగాకు ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. శుక్రవారం తిరుపతి–సికింద్రాబాద్ (07497), శనివారం సికింద్రాబాద్ –తిరుపతి (07498) రైలు రాకపోకలు సాగిస్తాయని చెప్పింది. విజయవాడ-సికింద్రాబాద్ (07213), సికింద్రాబాద్– విజయవాడ (07214) రైళ్లు 17, 18 తేదీల్లో నడుస్తాయని చెప్పింది. హైదరాబాద్ డెక్కన్ (నాంపల్లి) –భువనేశ్వర్ (07165) రైలు నవంబర్ 4 నుంచి 24 వరకు ప్రతి మంగళవారం.. భువనేశ్వర్ (07166) రైలు నవంబర్ 5 నుంచి 26 వరకు బుధవారం అందుబాటులో ఉంటాయని చెప్పింది.

ధర్మవరం–షోలాపూర్ రైలు అక్టోబర్ 18న, దర్భంగా– యశ్వంత్‌పూర్ (05541) రైలు అక్టోబర్ 20 నుంచి నవంబర్ 17 వరకు ప్రతి సోమవారం, యశ్వంత్‌పూర్–దర్భంగా (05542) వరకు అక్టోబర్ 23 నుంచి నవంబర్ 20 వరకు ప్రతి గురువారం రైలు నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే వివరించింది. తిరుపతి–సికింద్రాబాద్ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడే, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగనున్నాయి. సికింద్రాబాద్ ? తిరుపతి రైలు ఈ ప్రత్యేక రైళ్లు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గూటి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. విజయవాడ ? సికింద్రాబాద్ ? విజయవాడ రైలు మంగళగిరి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి స్టేషన్లలో ఆగుతాయి.

హైదరాబాద్ - భువనేశ్వర్ కొత్త– హైదరాబాద్ రైలు సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, కుర్దారోడ్, భువనేశ్వర్ స్టేషన్లలో ఆగుతుందని వివరించింది. సోలాపూర్ ? ధర్మవరం– షోలాపూర్ రైలు కుర్దువాడి, బర్శి టౌన్, ధారశివ్, లాతూర్, లాతూర్ రోడ్, ఉద్గీర్, భాల్కి, బీదర్, వికారాబాద్, యాద్గిర్, కృష్ణా, రాయచూర్ మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గూటి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. దర్భంగా – యశ్వంత్‌పూర్ – దర్భంగా రైలు నమస్తిపూర్, ముజఫర్‌పూర్, హాజీపూర్, సోన్‌పూర్, ఛప్రా గ్రామిణ్, ఛప్రా, సివాన్, డియోరియా సదర్, గోరఖ్‌పూర్, గోండా, బారాబంకి, ఐష్‌బాగ్, కాన్పూర్ సెంట్రల్, ఒరై, వీజీఎల్ ఝాన్సీ, బీనా, భోపాల్, ఇటార్సీ, చంద్రపూర్, నాగ్‌పూర్ క్యాబిన్, అమలాపూర్, రామపూర్ క్యాబిన్, అమ్లాపూర్ కాజీపేట, కాచిగూడ, మహబూబ్‌నగర్, ధోనే, ధర్మవరం, హిందూపూర్, యలహంక స్టేషన్లు ఆగుతాయని వివరించింది.

# కర్ణాటకలోని హంపిలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎంఐఎస్) శిక్షణార్థులతో ముచ్చటించిన కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ కర్ణాటకలోని హంపిలో 2025 అక్టోబర్ 15న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎంఐఎస్) శిక్షణార్థులతో ముచ్చటించారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 60 మందితో పాటు.. ఇన్ఫోసిస్, ఎంఎస్‌పీఎల్, ఐబీఎం, టీసీఎస్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, మంగళూరు రిఫైనరీ, పెట్రోకెమికల్స్, హెచ్ఏఎల్, ఎన్ఎండీసీ, హనీవెల్ టెక్నాలజీ సొల్యూషన్స్ తదితర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో పీఎంఐఎస్ ద్వారా ఇంటర్న్‌లు సాధించిన అనుభవాన్ని, వారి ఆకాంక్షలను మంత్రి తెలుసుకున్నారు. ఈ పథకంలో వారు చేరడానికి ఎలా స్ఫూర్తి పొందారో తెలుసుకోవడంతో పాటు.. ఇంటర్న్‌షిప్పులో నేర్చుకున్న అంశాలను, మెరుగుపరుచుకున్న నైపుణ్యాల గురించి చర్చించారు. వారి వృత్తి జీవితానికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించి ప్రోత్సహించారు.

ఇంటర్న్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినవారిని ఆయా సంస్థలు ఇప్పటికే పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకున్నాయి. వారికి మంత్రి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పని ప్రదేశాల్లో నిరంతరం మార్పులు చోటు చేసుకుంటున్న ఈ తరుణంలో వాటికి తగినట్టుగా మారాల్సిన ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. అంకితభావాన్ని ప్రశంసించారు. "ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా వ్యక్తిత్వ వికాసానికి అనేక మార్గాలు ఉన్నాయని తెలుసుకోవడం ఆనందదాయకం. పనికి సంబంధించిన ప్రధానాంశాలను తెలుసుకోవడం, కమ్యూనికేషన్ అడ్డంకులను అధిగమించడం లాంటి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు" అని మంత్రి అన్నారు.

పీఎంఐఎస్ ద్వారా యువత పరివర్తనకు సంబంధించిన అద్భుతమైన విజయగాథలను తెలియజెప్పే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.

అలాంటిదే ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన కాలువ హరికృష్ణ కథ. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఐటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న అనంతరం అదే సంస్థలో పూర్తిస్థాయి ఉద్యోగిగా విధుల్లో చేరారు. అతడి తండ్రి రైతు. తల్లి గృహిణి. తన ప్రయాణాన్ని ''నిజమైన పరివర్తన''గా హరి వర్ణించారు. మంత్రి చేతుల మీదుగా ఆఫర్ లెటర్ తీసుకోవాలన్న కోరికను వ్యక్తం చేశారు. దానికి మంత్రి అంగీకరించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు చెందిన మరో అభ్యర్థి ఆర్ లక్ష్మీ ప్రసన్న.. ఇన్ఫోసిస్‌లో చేరడం ద్వారా పీఎంఐఎస్ తనకు కొత్త అవకాశాలను ఎలా అందించిందో వివరించారు. ఈ ఇంటర్న్‌షిప్ తనకు ఆత్మవిశ్వాసాన్నివ్వడంతో పాటు కార్పొరేట్ ప్రపంచాన్ని పరిచయం చేసిందని వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె తెలియజేశారు.

అదే విధంగా.. హనీవెల్ టెక్నాలజీ సొల్యూషన్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎంబెడెడ్ ఇంజనీర్ ఇంటర్న్‌గా చేరిన కేరళకు చెందిన గౌరి హెచ్ తన స్ఫూర్తిదాయక గాథను పంచుకున్నారు. సింగిల్ పేరెంట్ అయిన ఆమెకు ఓ కూతురు ఉన్నారు. చదువులో ప్రతిభ కనబరిచినప్పటికీ తాను ఎంచుకున్న రంగంలో పరిమిత అవకాశాలు మాత్రమే ఉన్నాయని, తాను కలలు కన్న కెరీర్‌లో అడుగు పెట్టేందుకు పీఎంఐఎస్ దోహదపడిందని ఆమె తెలియజేశారు. ఆమె ప్రయాణాన్ని మంత్రి కొనియాడుతూ.. "గౌరి సానుకూల దృక్పథం, పట్టుదల నన్ను ఆకట్టుకున్నాయి. పీఎంఐఎస్ వెనుక ఉన్న నిజమైన సంకల్పాన్ని, స్ఫూర్తిని రూపొందించింది ఆమె లాంటి కథలే" అని తెలియజేశారు.

పెరుగుతున్న పీఎంఐఎస్ ప్రభావం, వికసిత్ భారత్ 2047 దిశగా భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని తయారుచేయాలనే ప్రభుత్వం అంకితభావాన్ని పునరుద్ఘాటిస్తుంది.

అయిదేళ్ల కాల వ్యవధిలో భారతీయ యువతకు ఉపాధిని, నైపుణ్యాలను, ఇతర అవకాశాలను అందించేందుకు ప్రధానమంత్రి ప్రారంభించిన అయిదు పథకాల ప్యాకేజీలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎంఐఎస్) ఓ భాగం. పూర్తి స్థాయి విద్య లేదా ఉపాధి కార్యక్రమంలో భాగం కాని 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతను పీఎంఐఎస్ లక్ష్యంగా చేసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి సంస్థల్లో వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాన్ని ఇది అందిస్తుంది. వచ్చే అయిదేళ్లలో కోటి మందికి ఇంటర్న్‌షిప్పులు అందించాలని, భారతీయ యువతకు ఉద్యోగావకాశాలు విస్తరించాలనేదే ఈ పథకం లక్ష్యం. ప్రస్తుతం ఈ పథకానికి సంబంధించిన ప్రయోగదశ కొనసాగుతోంది. ఈ పథకానికి సంబంధించిన మరింత సమాచారం కోసం https://pminternship.mca.gov.in/ సందర్శించండి.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం : సీఐ శంకర్ గౌడ్



నల్గొండ, అక్టోబర్ 17:గ్రామాల్లో శాంతి భద్రతలను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగ పడుతాయని యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ గౌడ్ అన్నారు. మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై మోటకొండూర్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉంటే నేరాలను సులభంగా నియంత్రించవచ్చునన్నారు. అంతేకాకుండా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందే నిరోధించవచ్చునన్నారు. ఒకవేళ నేరం జరిగినా, రికార్డుల సహాయంతో నిందితులను వెంటనే గుర్తించడం చాలా సులభమవుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించి, ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ఆయా కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్‌బండ్ ఆధునికీకరణ పనులు ప్రారంభించిన మంత్రులు



మక్తల్, అక్టోబర్ 17: మక్తల్ నియోజకవర్గం కేంద్రంలోని మక్తల్ పెద్ద చెరువు (మినీ ట్యాంక్ బండ్) వద్ద రూ.3:70 లక్షల రూపాయల సీఎండీఏ నిధులతో మినీ ట్యాంక్ బండ్ ఆధునికీకరణ, సుందరీకరణ పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో కలిసి శంకుస్థాపన చేశారు. అంతకుముందు శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్,పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, మత్స్య శాఖ చైర్మన్ మెట్టా సాయి కుమార్, మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి, డిసిసి అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ లో పోషణ మాసోత్సవం

భూపాలపల్లి, అక్టోబర్ 17 సరైన పోషణ తో ఆరోగ్య వంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి అధ్యక్షతన పోషణ మాసం ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జీఎస్ఆర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ కలెక్టర్ నవీన్ రెడ్డి, డీఈవో రాజేందర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. మధుసూదన్ లు పాల్గొన్నారు.

ముందుగా అంగన్‌వాడీలు స్వయంగా తయారు చేసిన పలురకాల ఫుడ్ స్టాల్స్ ను అతిథులు పరిశీలించి, స్వయంగా రుచి చూసి అభినందించారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలు, బాలికలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గర్భిణీ మహిళలకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షయచిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అంతకంతకూ పెరుగుతున్న భారత్ స్వదేశీ పరాక్రమానికి ఉజ్వల నిదర్శనం 'ఆపరేషన్ సిందూర్': రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 17:"అంతకంతకూ పెరుగుతున్న భారత్ స్వదేశీ పరాక్రమానికి 'ఆపరేషన్ సిందూర్' ఉజ్వల నిదర్శనం. ఇది దేశంలో స్వావలంబన కలిగిన రక్షణ తయారీ అనుబంధ విస్తారిత వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పట్టు విడువక చేసిన ప్రయత్నాల ఫలితమ"ని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు పుణెలో స్పష్టం చేశారు. సింబయోసిస్ స్కిల్స్, ప్రొఫెషనల్ యూనివర్సిటీ స్నాతకోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నమ్మకం, నిరంతర శ్రమ వంటి గుణాలు విద్యార్థులకు ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు.

రక్షణ రంగంలో స్వయంసమృద్ధి కలిగిందిగా భారత్‌ను తీర్చిదిద్దే పనిని ప్రభుత్వం మొదలుపెట్టినప్పుడు అది ఆరంభంలో కష్టమనిపించిందని రక్షణ మంత్రి విద్యార్థులతో చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశీయ రక్షణ తయారీ సామర్థ్యాన్ని పెంచడానికి సకల ప్రయత్నాలనూ చేశామనీ, దీంతో సానుకూల ఫలితాలు రావడం మొదలైందనీ మంత్రి తెలిపారు.

మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, "స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మనం ఆయుధాల కోసం ఇతర దేశాల మీద ఎక్కువగా ఆధారపడ్డాం. ఈ కారణంగా, రక్షణ రంగంలో మార్పును తీసుకు వచ్చే దిశగా పయనించాలని మేం ప్రతిన బూనాం. ఆయుధాలను భారత్‌లో తయారు చేసే రాజకీయ సంకల్పం మనలో లోపించినందువల్ల వాటిని కొనుగోలు చేయడానికి అలవాటుపడిపోయాం. రక్షణ తయారీని ప్రోత్సహించడానికి అవసరమైన చట్టాలూ రూపొందించుకోలేదు. ఈ స్థితిలో మార్పు అవసరమైంది. మన సైనికులకు దేశీయంగా ఆయుధాలను భారత్ తయారుచేయాలనేది మా సంకల్పమే. ఆపరేషన్ సిందూర్ వేళ మన సైనికుల ధైర్య సాహసాలను ప్రపంచం గమనించింది. వారు భారత్లో తయారైన సామగ్రిని పెద్ద ఎత్తున వినియోగించి, నిర్దేశించిన లక్ష్యాల్ని సాధించార"న్నారు.

రక్షణ రంగానికి కావలసినవి తయారు చేయడంలో యువత తోడ్పాటు ముఖ్యమని రక్షణ మంత్రి అన్నారు. గత 10 సంవత్సరాల్లో రక్షణ ఉత్పాదన స్థాయి ఏటా రూ.46,000 కోట్ల నుంచి రూ.1.5 లక్షల కోట్లకు చేరుకోవడం ఒక రికార్డు అనీ, దీనిలో సుమారు రూ.33,000 కోట్ల విలువైన ఉత్పాదనలను ప్రయివేటు రంగం సమకూర్చిందన్నారు. రూ.3 లక్షల కోట్ల విలువైన రక్షణ రంగ ఉత్పాదనల తయారీతో పాటు రూ.50,000 కోట్ల విలువైన ఎగుమతుల లక్ష్యాన్ని 2029కల్లా సాధించగలమన్న విశ్వాసం తనకుందని ఆయన చెప్పారు.

విద్యార్థులు చదువులో విజయం సాధించడానికి మించి, సృజనకారులుగా, ఆవిష్కర్తలుగా, దేశాభివృద్ధికి తమ వంతుగా తోడ్పడేవారుగా మారాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కోరారు. సిసలైన విజయం డిగ్రీలు అందుకోవడంలోనే లేదనీ, సంపాదించుకున్న జ్ఞ?నాన్ని సమాజానికి మేలు చేయడానికి అర్థవంతంగా ఉపయోగించడంలోనే ఉందనీ ఆయన స్పష్టం చేశారు.

భారత్ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నైపుణ్యాభివృద్ధి పాత్ర ఎంతో ముఖ్యమని రక్షణ మంత్రి చెప్తూ, "మనం 'మీకు తెలిసిందేమిటి?' అనే యుగంలో లేం. 'మీరు ఏమి చేయగలుగుతారు?' అంటూ వర్తమాన ప్రపంచం ప్రశ్నిస్తోంది. జ్ఞనాన్ని సద్వినియోగం చేయలేదంటే అది అసంపూర్ణంగా మిగులుతుంది. నేర్చుకోవడానికీ, చేసి చూపెట్టడానికీ మధ్య వంతెన లాంటిది నైపుణ్య"మన్నారు.

సాంకేతికత ప్రసరిస్తున్న ప్రభావాన్ని గురించి, మరీ ముఖ్యంగా కృత్రిమ మేధను (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్..ఏఐ) గురించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, ఉద్యోగ నష్టాలు, మనుషుల అవసరం లేకపోవడం తాలూకు భయాలను పటాపంచలు చేశారు. మానవుల చోటులోకి ఏఐ రాదనీ, ఏఐని ఉపయోగించేవారు దానిని వాడని వారి చోటులోకి వచ్చి చేరతారనీ మంత్రి అన్నారు.

